క్లుప్తంగా

బిల్లుమడ పరిసరాల్లో 144వ సెక్షన్

సీతంపేట: మండలంలోని బిల్లుమడ పరిసరాల్లో 144వ సెక్షన్ అమలు చేస్తున్నట్లు తహసీల్దార్ ఎస్.నరసింహమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బిల్లుమడ రెవెన్యూ గ్రామంలో విశాఖపట్నం కాపురస్తులు వి.వెంకటపతిరాజు తండ్రి గోపాల కృష్ణంరాజు, మరో ముగ్గురు ఆసామీలకు 73.74 సెంట్ల జిరాయితీ భూమిపై వివాదం ఉన్న నేపథ్యంలో 144వ సెక్షన్ అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ భూమి పైకి ఎవ్వరూ వెళ్లకూడదన్నారు.

నిబంధనలు పాటించండి

● డీఎస్పీ కృష్ణారావు



పాలకొండ రూరల్: నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొనే యువత నిబంధనలు పాటించాలని డీఎస్పీ జీవీ కృష్ణారావు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, వీధుల్లో భారీ మైక్ సెట్లు పెట్టకూడదని తెలిపారు. అర్ధరాత్రి తర్వాత రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతూ, ఇతరులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవన్నారు.

ఆర్థిక సాధికారతపై అవగాహన



ఉచిత కుట్టు శిక్షణ గుర్తింపు పత్రాలతో మహిళలు

భామిని: మండల కేంద్రంలో హోలీక్రాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఆర్థిక సాధికారత, స్వావలంబన, రుతుస్రావ పరిశుభ్రతపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ కరణం ప్రభుదాస్ పలు సూచనలు చేశారు. అనంతరం మూడు నెలలుగా కుట్టు శిక్షణ నేర్చుకున్న మహిళలకు గుర్తింపు పత్రాలు, గ్లో క్లబ్ టీ షర్టులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ట్రైనీ సభ్యులు, గ్లో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

చిన్నబగ్గ ఆశ్రమ పాఠశాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఓ లిల్లీరాణి

సీతంపేట: మండలంలోని చిన్నబగ్గ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలను ఐటీడీఏ డిప్యూటీ ఈఓ ఎ.లిల్లీరాణి శనివారం తనిఖీ చేశారు. ఈ మేరకు రికార్డులు, హాజరు పట్టికలు పరిశీలించారు. అలాగే ఉపాధ్యాయుల లెస్సన్ ప్లాన్, టీచింగ్ డైరీ, బోధనా తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి



సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్ సోమేశ్వరరావు

పాలకొండ: గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందించాల్సిన సేవలు, స్పందనలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారం, సమగ్ర భూసర్వే, నాలా పన్ను వసూళ్లు, తదితర అంశాలపై సూచనలు చేశారు. వీఆర్వోలు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని, ధాన్యం కొనుగోలులో సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఆయనతో పాటు డీటీ బుచ్చయ్య, ఆర్‌ఐ పుష్ప ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు గౌరినాయుడు, ఆనందరావు

వీరఘట్టం: మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో యూటీఎఫ్ రూపొందించిన 2024 క్యాలెండర్‌ను ఎంఈఓలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ముందుంటామని యూటీఎఫ్ నాయకులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.పైడిరాజు, వి.విన్నాజీ, ఎం.ముకుందరావు, చంద్రమౌళి, వాసుదేవరావు, తదిరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

వీరఘట్టం: పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీని బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టారని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని పలువురు లబ్ధిదారులకు వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే కళావతి



తాలాడలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

భామిని: పేద ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని తాలాడ, మాసగూడలలో సర్పంచ్ ఎరుకుమజ్జి ప్రభావతి, పార్టీ నాయకులు ఎరుకుమజ్జి పాపినాయుడు, కిల్లారి ఫాల్గుణరావు, సుంకు ఉమ ఆధ్వర్యంలో శనివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాల వల్ల ఒక్కో కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అలాగే వ్యక్తిగత, సామాజిక సమస్యలేమైనా ఉంటే అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందిస్తున్న జగనన్నకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అంతకుముందు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే కళావతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, టి.అన్నాజీరావు, బూస బాలకృష్ణ, ఒడ రమణ, భూపతి కిరణ్, బిడ్డిక మోజేష్, మాజీ సర్పంచ్ బిడ్డిక సావిత్రి, ఎంపీడీఓ ఉమామేశ్వరి, ఏపీఓ డి.భవానీ, ఎంఏఓ కె.మన్మథరావు, ఎస్సై సీహెచ్ ప్రసాద్, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

'వైఎస్సార్ కల్యాణమస్తు'తో ఆర్థిక ఆసరా



లబ్ధిదారులకు కల్యాణమస్తు మంజూరు పత్రాలను అందిస్తున్న సర్పంచ్ గౌరీశంకరరావు

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వం వైఎస్సార్ కల్యాణమస్తు పథకం కింద అందించిన ఆర్థిక సాయం తమకు ఎంతో ఆసరాగా నిలిచిందని గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన నిమ్మక పద్మ, పాలక అశ్విని ఆనందం వ్యక్తం చేశారు. నిరుపేదలైన వీరు వారి కూతుళ్లకు ఇటీవల వివాహం చేశారు. గ్రామ సచివాలయం ద్వారా వైఎస్సార్ కల్యాణమస్తు పథకానికి దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో లక్ష రూపాయల చొప్పున నగదు జమ చేసింది. ఈ మేరకు స్థానిక సచివాలయం వద్ద సర్పంచ్ బొత్తడ గౌరీశంకరరావు, సచివాలయ ఉద్యోగులతో కలిసి కల్యాణమస్తు పథకం మంజూరుకు సంబంధించిన పత్రాలను శనివారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు ప్రభుత్వం సాయం చేయడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ సంతోష్, వైస్ సర్పంచ్ కిశోర్, వార్డు సభ్యులు జె.వెంకటరావు, మాజీ సర్పంచ్ ప్రేమానంద్ ఉన్నారు.

ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్ ప్రారంభం



ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు పుష్పశ్రీవాణి, జోగారావు

కొమరాడ: మండలంలోని శివిని గ్రామంలో నిర్మించిన ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్ (కల్యాణ మండపం)ను కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వివాహాది శుభకార్యాల నిమిత్తం నిర్మించిన ఈ కన్వెన్షన్ హాల్‌ను చుట్టుపక్కల గ్రామస్తులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి శ్యామల, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, పార్టీ నాయకులు శెట్టి మధుసుదనరావు, కళింగ మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

● డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

గరుగుబిల్లి: మార్చి నెలలో జరగనున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలను సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ అన్నారు. మండలంలోని రావుపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. పాఠశాల రికార్డులు, విద్యార్థుల విద్యాప్రమాణాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై పలు సూచనలు చేశారు. పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా అవసరమైన కార్యాచరణ చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ వారిని వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంఈఓ ఎన్.నాగభూషణరావు, గరుగుబిల్లి జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం ఎస్.ఎల్.పాత్రుడు, తదితరులు ఉన్నారు.

మెరుగైన బోధన అందించాలి

పాలకొండ రూరల్: విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని డిప్యూటీ డీఈఓ పి.కృష్ణమూర్తి అన్నారు. పట్టణంలోని వెంకమ్మపేట పాఠశాలను ఎంఈఓ కె.సోంబాబుతో కలసి శనివార తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యార్థుల అభ్యున్నతికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పక్కాగా అమలు చేయాలన్నారు. అనంతరం విద్యార్థుల వర్క్‌బుక్స్, నోట్స్‌లను పరిశీలించి, పలు ప్రశ్నలు వేశారు. సమాధానాలు బాగా చెప్పిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం పరాంకుశం నాయుడు, బి.ఉదయబాబు, నాగమణి, ఎస్.గోపి, వి.భారతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి మున్సిపల్ కార్మికుల సమస్యలు

● కమిషనర్‌ను కోరిన కార్మిక సంఘ నాయకులు



కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న కార్మికులు

పాలకొండ రూరల్: మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కార్మిక సంఘ నాయకులు పడాల భాస్కరరావు, సీహెచ్ సురేష్, తదితరులు కోరారు. ఈ మేరకు పాలకవర్గ ప్రతినిధులతో పాటు కమిషనర్ ఎస్. సర్వేశ్వరరావును శనివారం కలిసి తమ సమస్యలు వివరించారు. సమాన పనికి సమాన వేతనం, ఒప్పంద ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, తదితర హామీలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని కోరారు. తమకు మద్దతుగా ఇంజినీరింగ్ విభాగంలో గల ఎలక్ట్రికల్, వాటర్ నిర్వహణ సిబ్బంది ఆదివారం నుంచి సమ్మెలో పాల్గొంటారని తెలిపారు.

డీజేలు నిషేధం

వీరఘట్టం: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఎవ్వరూ డీజేలు పెట్టకూడదని ఎస్సై ఎం. గోవింద అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నిబంధనలకు విరుద్ధంగా ఎవ్వరైనా డీజేలు పెడితే చర్యలు తప్పవన్నారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తామని చెప్పారు.

వాహనాల వేలం

కురుపాం: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) అధికారుల దాడుల్లో పట్టుకున్న మూడు ద్విచక్రవాహనాలను ఎక్సైజ్ ఎస్సై బీవీఎస్ భూషణరావు ఆధ్వర్యంలో శనివారం వేలం వేశారు. వేలంలో పాల్గొన్న పలువురి నుంచి ఆధార్‌కార్డు, వారి పూర్తి వివరాలను ఎస్ఈబీ సిబ్బంది సేకరించి వేలం ప్రారంభించారు. పాటదారులకు స్క్రాప్‌కండీషన్‌లో ఉన్న వాహనాలను అప్పగించారు.

పాలకొండ టీడీపీలో ఫోన్‌కాల్స్ కలకలం

● టీడీపీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థి ఎంపిక కోసం చంద్రబాబు వాయిస్‌తో అభిప్రాయసేకరణ
● కొత్తవారికే పాలకొండ టీడీపీ టికెట్ అంటూ ఓ వర్గం ప్రచారం
● అవి ఫేక్‌కాల్స్ అంటున్న జయకృష్ణ వర్గం



వీరఘట్టం: 'హలో నేను మీ చంద్రబాబునాయుడును... పాలకొండ టీడీపీ అభ్యర్థిని ఎంపిక చేసేందుకు మీ సహకారం కావాలి అంటూ వాయిస్ వచ్చిన తర్వాత.. ఓ మహిళ మాట్లాడుతూ సవర మాలయ్య నచ్చితే 1 ప్రెస్‌చేయండి, పడాల భూదేవి నచ్చితే 2 నొక్కండి, నోటా అయితే 3 నొక్కండి, ఈ సందేశాన్ని మరలా వినాలంటే సున్నా నొక్కండి' అంటూ చివరిలో చంద్రబాబు వాయిస్‌తో ధన్యవాదాలు అంటూ నియోజకవర్గంలోని పలువురికి ఫోన్ నంబర్: 86453 12724తో శనివారం వచ్చిన కాల్స్ చర్చనీయాంశంగా మారాయి. టీడీపీలో కలకలం రేపుతున్నాయి. ఆ కాల్‌లో ప్రస్తుత టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ పేరు ప్రస్తావించకపోవడం గమనార్హం. దీనిని ఆధారంగా చేసుకుని ఈ సారి పాలకొండ టీడీపీ టిక్కెట్లు కొత్తవారికే ఇస్తారన్న ప్రచారాన్ని ఓ వర్గం ముమ్మ రం చేసింది. గత మూడు ఎన్నికల్లో నిమ్మక కుటుంబ సభ్యులు ఓడిపోయారని, ఈ సారి జయకృష్ణకు టికెట్ ఇవ్వవద్దని బహిరంగంగానే ప్రచారం చేస్తున్నారు. అయితే జయకృష్ణ మాత్రం ఈ సారి కూడా టికెట్ తనకే అంటూ ప్రచారం కొనసాగిస్తున్నారు. చంద్రబాబునాయుడు వాయిస్‌తో వచ్చినవి ఫేక్ కాల్స్ అని ఆయన వర్గీయులు చెబుతున్నారు. జయకృష్ణను మానసికంగా దెబ్బతీయాలని కొందరు చూస్తున్నారని అంటున్నారు.

జన్‌మాన్ కార్డుల పంపిణీ

గరుగుబిల్లి: మండలంలోని చినగుడబ, ఆర్.డి.వలస, సీమలవానివలస, గదబవలస తదితర గ్రామాల్లో ప్రధానమంత్రి జన్‌మాన్ కార్డులను శనివారం పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో అర్హులైన 81 మందికి పీఎం జన్‌మాన్ కార్డులను ఎంపీడీఓ జి.పైడితల్లి అందజేశారు. ఇల్లు లేని గిరిజనులకు గృహాలు మంజూరు చేయడంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.2.40 లక్షలు ఆర్థిక సాయం అందజేయనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో సర్వే చేసి అర్హులను గుర్తించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి శిరీష, తదితరులున్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి

● కమిషనర్ సర్వేశ్వరరావు

పాలకొండ: అధికారులు, పాలకవర్గ సభ్యుల సహకారంతో నగర పంచాయతీ అభివృద్ధి సాధ్యమవుతుందని కమిషనర్ ఎస్. సర్వేశ్వరరావు తెలిపారు. నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఏడాదిలో ఇంతవరకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను కమిషనర్ వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సమన్వయంతో పనిచేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించగలిగామని తెలిపారు. నగర పంచాయతీ అధ్యక్షురాలు యందవ రాధాకుమారి మాట్లాడుతూ, మౌలిక వసతుల కల్పన కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం పట్టణంలో చేపడుతున్న సీసీ రహదారులు, కాలువల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని తెలిపారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. సమావేశంలో వైస్ చైర్మన్‌లు రౌతు హనుమంతురావు, పల్లా ప్రతాప్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సేవలు అందిస్తున్నాం..



నవగాం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిర్వహణ పనులు పర్యవేక్షిస్తున్న డీఈఈ, ఏఈ, తదితరులు

● ట్రాన్స్‌కో డీఈఈ మోహన్ చక్రవర్తి

పాలకొండ రూరల్: మండలంలోని నవగాం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గల పాలకొండ,వీరఘట్టం, వంగర మండలాలకు మెరుగైన విద్యుత్ సరఫరా జరుగుతోందని ట్రాన్స్‌కో డీఈఈ మోహన్‌చక్రవర్తి అన్నారు. సబ్‌స్టేషన్ నిర్వహణ పనులను శనివారం ఆయన పర్యవేక్షించారు. ముఖ్యంగా జంగిల్ క్లియరెన్స్, పొలాల మధ్య వేలాడే తీగలను సరిచేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా విద్యుత్ సరఫరా చేయటమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. పాలకొండ పట్టణ పరిధి జగనన్న కాలనీలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నట్లు తెలిపారు. ఈయన వెంట ఏఈ శ్యామ్‌సుందర్, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ సందర్శన



విద్యార్థుల నోట్‌బుక్స్‌ను పరిశీలిస్తున్న ఆర్జేడీ హేమలత

కొమరాడ: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని పార్వతీపురం ఆర్జేడ కె.హేమలత విద్యార్థులకు సూచించారు. మండలంలోని దత్తత పాఠశాల అయిన కేజీబీవీని శనివారం ఆమె సందర్శించారు. పదో తరగతి గదికి వెళ్లి విద్యార్థినులతో ముచ్చటించారు. వారి అభ్యసన సామర్థ్యాలు తెలుసుకుని పలు సూచనలు చేశారు. పరీక్షలు దగ్గరపడుతున్నందున ప్రణాళికతో చదవాలని, సబ్జెక్టులలో ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఫస్ట్‌క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించేలా కృషిచేయాలన్నారు. విద్యార్థుల నోట్ బుక్స్ పరిశీలించారు. పాఠశాలలో వసతులపై ఆరా తీశారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ జి.అరుణ్‌కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమం



సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సుజాత, తదితరులు

కురుపాం: వైఎస్సార్‌సీపీతోనే ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత అన్నారు. మండలంలోని జరడ పంచాయతీలో సర్పంచ్ జ్యోతి అధ్యక్షతన శనివారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. గ్రామ సచివాలయం వద్ద సంక్షేమ పథకాల డ్యాష్‌బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బిడ్డిక అన్నాజీరావు, రంగారావు, ఎంపీటీసీలు విద్యారాణి, రాజేశ్వరి, పార్టీ మండల కన్వీనర్ గౌరీశంకరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం



ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గొటివాడ గ్రామస్తులు

కురుపాం: తమ గ్రామానికి రహదారి మంజూరు చేయడంపై గొటివాడ గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు చిత్రపటానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన తిమ్మక కోటేశ్వరరావు, శంకరరావు, ఎంపీటీసీ సునీత, సర్పంచ్ తట్టమ్మ మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో రాకపోకలు సాగించేందుకు అనేక అవస్థలు పడ్డామని, సమస్యను ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజుకు చెప్పడంతో వారు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరుకు కృషి చేశారన్నారు. రహదారి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.20 కోట్లు మంజూరు చేయడంతో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి ఇటీవల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. త్వరలోనే తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం వస్తుందని, ప్రయాణ కష్టాలు తీరిపోతాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'



కొమరాడ: విక్రాంపురంలో 'ఆడుదాం ఆంధ్రా' క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



భామిని: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ స్కూల్ గ్రౌండ్‌లో కబడ్డీ పోటీ

కొమరాడ: గ్రామీణ యువతలోని క్రీడా ప్రతిభను గుర్తించి, వారికి క్రీడల్లో ప్రోత్సహించేందుకు గాను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. మండలంలోని విక్రంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో పరశురాంపురం, విక్రంపురం, గుణానుపురం సచివాలయాల పరిధిలోని యువతకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ నాయకుడు కళింగ మల్లేశ్వరరావు ప్రారంభించారు. క్రీడాకారులను కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, తదితర పోటీలను నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని పోటీలను తిలకించారు.

భామిని: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానం, ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో శనివారం నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్రా' క్రీడాపోటీలు హోరాహోరీగా సాగాయి. యువకుల ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని తమలోని క్రీడా ప్రతిభను పదర్శించారు.

చురుగ్గా పర్యాటకాభివృద్ధి పనులు



ఎస్.కె.పాడు నర్సరీలో పర్యాటకాభివృద్ధి పనుల్లో భాగంగా సిద్ధమవుతున్న క్యాంటీన్, షాపింగ్ కాంప్లెక్స్



పర్యాటకులు కూర్చొనేందుకు వీలుగా ఏర్పాటు చేసిన బెంచీలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎస్.కె.పాడు ఉద్యానవన నర్సరీ కేంద్రంలో పర్యాటకాభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సంక్రాంతి పండుగకు ముందే పనులు పూర్తిచేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్, పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణుచరణ్ భావిస్తున్నారు. వారి సూచనల మేరకు భద్రగిరి గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగం అధికారులు పనులు వేగవంతం చేశారు. ప్రస్తుతం రూ.60 లక్షలతో క్యాంటీన్, షాపింగ్ కాంప్లెక్స్, టాయిలెట్స్, ఇంటర్నల్ రోడ్లు, పార్కింగ్, ఆర్చ్‌ల నిర్మాణంతో పాటు మరో రూ.10 లక్షలతో బోటు షికారు నిమిత్తం అక్కడి చెరువు వద్ద రివిట్‌మెంట్ (రాతికట్టు) పనులు చేపడుతున్నారు. అంతే కాకుండా రూ.35 లక్షలతో పర్యాటకులు బస చేసేందుకు వీలుగా డార్మెంటరీలను నిర్మిస్తున్నారు.